

# ఓ బాసుగారి కుక్కగారు

వియోగి

"సుబ్రావ్! ఏంటి పొద్దున్నే ఇలా వచ్చావు?" భీమశంకరం అడిగాడు.

"నమస్కారం సార్! మొన్న చెబితి కదు సార్- మా బామ్మర్దికి ఉద్యోగం యిప్పిస్తానన్నారు కదా- ఈ రోజు గుర్తు చేయమన్నారు-" వినయంగా చెప్పాడు సుబ్రావు.

"అన్నీ టెంపరరీ పోస్టులే! ఎంత కాలం పనిచేసినా పర్మనెంటు కాదు. పైగా జీతం కూడా పూర్తిగా యివ్వం- అతని శాలరీనే నలుగురికి పంచి పెడతాం- మరింక లాభం ఏంటి?" మేనేజరు భీమశంకరం చెప్పాడు. ఆయన ఈ మధ్యే కర్నూలుకు బదిలీ మీద వచ్చాడు.

"ఏదో తమ దయ వల్ల ఆఫీసులో యిరుక్కుంటే ఆ పైన దేవుడున్నాడు పర్మనెంటు చేయడానికి-"

"ఆ కాలాలు పోయాయి- మూడు నెలలు కాకుండానే తీసేస్తున్నారు. అసలు రిక్రూట్‌మెంటు వస్తుందో లేదో తెలీదు-"

"ఏదోకటి- ముందు యిరికించండి- భవిష్యత్తు ఎలా ఉంటే అలా జరుగుతుంది." కాళ్లా వేళ్ళా పడ్డాడు.

భీమశంకరం ఆలోచనలో పడ్డాడు సుబ్రావు అభ్యర్థన గురించి.

"ఏవండోయ్! మీరిల్లు అస్సలు పట్టించుకోరు- ఎన్నిటికని నేను చావాలి!" విసురుగా బయటకు వచ్చింది ఆండాళ్ళమ్మ.

"ఏం కొంపలు అంటుకున్నాయోయ్!" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇవ్వాళ పనిమనిషి రాలేదు- అంట్లు అలానే పడున్నాయి- సరే అంట్లు అంటే ఏడవచ్చు- లేదా వేరే గిన్నెలు వాడుకోవచ్చు. కాని ఈ జానీగాడితోనే ఎలా చావాలి?" ఆండాళమ్మ ఆపసోపాలు పడుతున్నాది.

"జానీ ఏవన్నా అన్నాడా? డొక్క చీరేస్తా!" భీమశంకరం లేచాడు.

"అరే! నాతో చెప్పండి అమ్మగారు- వాడ్ని ఎముకలు ఏరేస్తాను." సుబ్రావు ఆవేశపడ్డాడు.

"జానీ నీకు తెల్సా?" భీమశంకరం అడిగాడు.

"నాకు తెలీదండి..."

"మరి- ఏదేదో అంటున్నావు-?"

"మరి అమ్మగారికి కష్టం కలిగించేవాడెవడయినా సరే నే ఊరుకోను అంతే! మంచిగా ఉన్నంత కాలం నేను మంచిగా ఉంటాను- మా అమ్మగారి మీద ఈగ వాలిందంటే ఎత్తి బండవేస్తాను." రౌద్రంగా అన్నాడు.

"అరే అరే! నీ స్వామి భక్తి మండిపోను- ఈగతో పాటు నేను ఛస్తాను కదయ్యా నువ్వు బండ వేస్తే నామీద!"

"అంతేనండీ- నే ఊరుకోలేను- ఈగ కానివ్వండి- దోమ కానివ్వండి- దాని సంగతి చూడాల్సిందే- ఇంతకీ ఆ జానీ ఏడి చూపించండి- చావ కొడతాను- మందసలే కసరత్తు చేసిన శరీరం?" ఊగిపోయాడు పూనకం వచ్చినట్లు సుబ్బారావు- భీమశంకరం అతన్ని గమనిస్తూ ఉండటంతో రెచ్చి

పోతున్నాడు.

''జానీ అంటే ఎవరనుకున్నావయ్యా- తెగ ఇదై పోతున్నావు?'' ఆండాళ్ళమ్మ చకితురాలవుతూ అడిగింది.

''ఓ రౌడీ వెధవయి ఉంటాడు-'' చెప్పాడు.

''కాదు సుబ్రావు- మా ముద్దుల బుల్ డాగ్!'' భీమశంకరం చెప్పాడు వంకరగా నవ్వుతూ.

గతుక్కుమన్నాడు సుబ్బారావు.

''అరే! జానీ అంటే కుక్కా!'' ఆశ్చర్యపోయాడు.

''షటప్! కుక్క కాదు డాగ్!'' కోపంగా అన్నాడు భీమశంకరం.

''డాగ్ అన్నా కుక్క అన్నా ఒకటే కదండీ!'' ఎందుకంత కోపం వచ్చిందో అర్థంకాక బిక్క చచ్చిపోయి అడిగాడు.

''మర్యాద- మర్యాద- మా జానీని కుక్క అంటే చాలా కోపం వస్తుంది- అంటే జానీ అను లేదా- కుక్కగారు అను.'' ఆండాళ్ళమ్మ సర్ది చెప్పింది.

''ఓర్నాయనోయ్! ఇదెక్కడి గోలరా బాబు!'' విస్మయం చెందాడు.

''ఇంతకీ జానీ ఏం చేస్తున్నాడే!'' భీమశంకరం అడిగాడు.

''వాడికి రోజూ ప్రొద్దున షికారుకు పోవడం అలవాటు- వాడ్ని రోజూ మన పనోడు నటరాజ్ తీసుకుపోతుండేవాడు- వాడు రాలేదు.. ఇప్పుడు పిల్లలు కూడ ట్యూషన్‌కెళ్లారు. వాడ్ని ఎవరు తిప్పుతారు బయటికి- ఒకటే గోల చేస్తున్నాడు.'' సమస్య వివరించింది ఆండాళ్ళు.

''అయితే నువ్వనేదేంటే- నేను జానీని పట్టుకుని ఊరంతా తిరిగి రావాలి? నా స్టేటస్ ఏంటి- నేనేంటి- అందరూ చూస్తూ ఉండగా జానీతో పరుగెత్తాలంటే బావుండదే!'' గొల్లుమన్నాడు భీమశంకరం ''పోనీ! ఓ పని చెయ్యి నువ్వే ఒక రౌండ్ వేయించుకురా!'' చెప్పాడు.

''అయ్యో! ఇది చెన్నై-కాని ముంబై కాని కాదండి- పల్లెటూరు కాని పట్టణం కాని కర్నూలు అండి- అందరూ విచిత్రంగా చూడరూ!'' ఆండాళ్ళమ్మ గుర్తు చేసింది.

''నిజమే! మన వయసుకు మన కాయాలకు జానీతో షికారు పోతే నవ్వి పోతారు- పెద్ద చిక్కే వచ్చిందే- ఇప్పుడేం చేయాలబ్బా!'' ఆలోచనలో పడ్డాడు జుత్తు పీక్కుంటూ.

సుబ్బారావు తెల్ల మొహం వేసి నిల్చునున్నాడు.

''దానికింత ఆలోచనెందుకండి- ఇతగాడెవడో ఉన్నాడుగా- మొగాడేగా- ఇతన్ని తీసుకుపొమ్మనండి-'' సలహా యిచ్చింది ఆండాళ్ళు.

''బాబు- సుబ్రావు- ఈ పని చేసి పెట్టవయ్యా! ఈ రోజుకు కాస్త మా జానీ గాడ్ని ఓ అరగంట బయటకు తిప్పి తీసుకురా. వాడికి నేచర్ కాల్సు బహిరంగ ప్రదేశాల్లో చేసుకోవడమే అలవాటు. జానీ చాలా బుద్ధిమంతుడు- పాపం అరుస్తాడే కాని కరువడు.'' చెప్పాడు భీమశంకరం.

''కుక్కని నేను బయటకు తీసుకుపోవాలా! అమ్మో నా వల్ల కాదు. కుక్కలంటే నాకు అలర్జీ సార్- మీ కుక్కను తీసుకు

పోవాలంటే యింకా భయం!'' సుబ్రావు భయపడ్డాడు.

''ఏందయా మాటి మాటికి మా జానీని కుక్క కుక్క అని అవమానం చేస్తున్నావు- నా బుల్ డాగ్‌ని అవమానిస్తే- నన్ను అవమానించినట్టే! అన్నట్లు ఇందాకేదో అడుగుతున్నావు- మీ బావమర్ది గురించా? కుదరదు- మనాఫీసులో ఉద్యోగాలు కుప్పలు పోసి ఉన్నాయా!'' భీమశంకరం చెప్పాడు గట్టిగా.

''అయ్యా! పెద్దలు తమరు అనుకుంటే అయిపోతుందని నాకు తెల్సు సార్!''

''నాకేం జిల పట్టిందయ్యా అడ్డమైన వాళ్ళకు ఉద్యోగాలు యివ్వడానికి !'' గయ్‌మని లేచాడు భీమశంకరం.

''ఒకవేళ ఉన్నా- ఇతను చెప్పిన వాళ్ళకు యివ్వద్దు-'' ఆండాళ్లమ్మ హితవు చెప్పింది భీమశంకరంకు.

''అయ్యో! నేనేం తప్పుచేశాను-'' బిత్తర పోయి తత్తరపాటుతో అడిగాడు.

''మరి జానీని షికారుకు తీసుకుపోనంటావా?'' భీమశంకరం.

''తీసుకుపోవాలంటే నాకు భయం సార్- జీవితంలో యింతవరకు కుక్కలు కాదు సార్- కుక్క పిల్లతో కూడ తిరగలేదు- దాని మొహం చూస్తేనే వికారం అనిపిస్తుంది.'' చెప్పాడు సుబ్రావు.

''జానీ!'' లోనికి కేక పెట్టింది ఆండాళ్లు.

రివ్వున పరుగెత్తుకుంటూ వచ్చాడు జానీ- రాగానే కొత్తగా వచ్చిన శాల్తీ వంక గుర్రుగా చూసి అరిచాడు.

సుబ్రావుకు భయం పట్టుకుంది.

''చూశావుగా ఎంత ముద్దొస్తున్నాడో!'' చంకన ఎత్తుకుంటూ అంది ఆండాళ్ళు.

''జానీ, ఇతని పేరు సుబ్రావు- మా ఆఫీసులో గుమాస్తా గిరి వెలగబెడుతున్నాడు. నిన్ను షికారుకు తీసుకుపోనంటున్నాడు.'' భీమశంకరం చెప్పాడు.

జానీ గుర్రుగా చూసి మొరిగాడు.

''మా జానీకి నువ్వు నచ్చలేదుట!'' ఆండాళ్ళు చెప్పింది.

''నేనేం పెళ్ళి చూపులకు రాలేదు నచ్చడానికి- నచ్చకపోవటానికి.''

''వాడ్ని కాకా పట్టు- నీ దగ్గరికి వస్తాడు'' చెప్పాడు భీమశంకరం.

''జానీ ఛీ ఛీ! టా టా!'' పిలిచాడు.

అంతే! జానీ ఎగిరి గంతేసి అతని ఒళ్ళో పడింది. భయపడ్డ సుబ్బారావు దూరంగా నెట్టివేశాడు. అతనికి జంతువులంటే అలర్జీ- కుక్కలంటే మరీనూ- అందులోనూ ఇది బొచ్చు కుక్క ఆయే! పైగా ఒళ్ళో కూర్చుంది- ఒక్క ఉదుటున పైకి లేచాడు

చీదరించుకుంటూ.

జానీ ఒక గంతులో కిందికురికింది.


అతని చుట్టూ తిరుగుతూ కోపంగా చూడసాగింది. కూర్చున్నాడు సోఫాలో ఎందుకైనా మంచిదని.

సుబ్బారావు కాళ్ళు పైకెత్తి సోఫాలో పెట్టుకున్నాడు భయంతో.

''కుయ్ కుయ్' అని మొరగసాగింది.

''సార్! అనవసరంగా వచ్చినట్లున్నాను- ఏమవుతుందో ఏమో!''

''ఏం ఫర్వాలేదు, మొరిగే కుక్కలు కరవ్వు. కరిచే కుక్కలు అరవ్వు- తెల్సుగా!'' భీమశంకరం వివరించాడు అతని భయాన్ని పోగొట్టడానికి.



జానీ, అతన్ని వాసన చూస్తూ అతని మీద ఎక్కడానికి ప్రయత్నిస్తున్నది...

సుబ్రావు మరింత భయపడసాగాడు. గువ్వలా ఓ మూల ఒదిగిపోతున్నాడు.

"నిజమే సార్! ఆ సంగతి మీకు తెల్సు- నాకు తెల్సు- మేడం గారికి తెల్సు- కాని మీ జానికి తెలుసో లేదో- తెలియదు కదా సార్! పిల్ల- పెల్లలు- సారి పెళ్ళాం-పిల్లలు కలవాడ్ని- దయవుంచి వెనక్కి పిలవండి.. మీ జానిని షికారుకు కాదు- యింకెక్కడికితీసుకుపొమ్మన్నా తీసుకుపోతాను." వణుకుతూ చెప్పాడు సుబ్రావు.

"జానీ! శాంతించు.. తీసుకుపోతాడులే- ఉండు నీకు గొలుసు కడతాను." అండాళ్ళు అలవోకగా దాని మెడలో గొలుసు బిగించి... ఆ గొలుసును సుబ్బారావుకు అందించింది. సుబ్బారావుకు తప్పలేదు, దాన్ని నడిపించుకుపోక తప్పలేదు. బహుశ అలనాడు శల్యుడు కూడ కర్ణుడి రథాన్ని తోలడానికి అంత బాధపడ్డాడో లేదో!

"సార్! బ్రతికుంటే మళ్ళీ వచ్చి కలుస్తా సార్!" అంటూ వీధిలోకి వచ్చాడు.

అంతే కుక్కగారు విజృంభించారు. 'జుయ్' అని పరుగు లంఘించుకుంది. ఆ ఫోర్సుకు బక్క ప్రాణి సుబ్బారావుకు నిలదొక్కుకోవడం కష్టంగా ఉంది. దాదాపు బాల్యం గుర్తు చేసుకుని తను పరుగు మొదలెట్టాడు.

అసలే బొచ్చు కుక్క! అల్లారు ముద్దుగా పెరిగింది! రాజ్యాంగం ప్రకారం స్వేచ్ఛలు ఎక్కువున్నాయి- పైగా ఆరోజు ఆలశ్యమయింది దానికి...

ముందు ఓ ఓపెన్ గ్రౌండుకు పోయి కాల కృత్యాలు తీర్చుకుంది.

సుబ్బారావు ముక్కులు బ్రద్దలైపోయాయి- తన మీద తను చేస్తున్న ఉద్యోగం మీద విరక్తి పుట్టింది. భీమశంకరం మీద- ఆండాళ్ళు మీద- జానీ మీద గొంతు దాకా కోపం వచ్చింది.

జానీ డైరెక్షన్ మార్చి యింకో వైపు నడవసాగింది నాజుగ్గా...కొంచెం బిజీగా వున్నవీధి.

అది రాజసంతో నడుస్తూ ఉంటే దాని సేవకుడిలా వినయంగా భయపడ్తూ నడుస్తున్నాడు.

ఇంతలో ఆ వీధిలోని నాలుగు కుక్కలు ఒక్కసారి అటువైపు వచ్చాయి." భౌ..భౌ" అంటూ అరవసాగాయి- జానీని చూసి.

కాళ్ళలోంచి వణుకు పుట్టుకొచ్చింది సుబ్బారావుకు.

అవి వీధి కుక్కలు- ఒక్కోటి సింహంలాగా బలిసి ఉంది. కోరలు చూస్తూ ఉంటే ఒళ్ళు జలదరిస్తున్నది.

'ఉష్ ఉష్' అని అదలించాడు- కాని అవి వెంటబడి అరుస్తున్నాయి- జానీ చుట్టూ వలయంగా ఏర్పడుతున్నాయి.

"పొరపాట్న కూడ జానీని ఊరకుక్కల దగ్గరకు పోనియ్యవద్దు-" అంటూ తను వచ్చేముందు మరీ హెచ్చరించి పంపింది గుర్తుకొచ్చింది.

నేలమీదకు ఒంగి రాళ్ళు ఏరుకుని ఆ కుక్కల్ని అదలించడానికి ఒక్కోటి విసరసాగాడు. కొంచెం దూరం అవి పారిపోయి- మళ్లీ వచ్చాయి.

జానీ ఒకటే అరుపు- గొలుసు విదిలించుకుని పారిపోదామని విశ్వప్రయత్నం చేస్తున్నది.

సుబ్రావుకు కోపమొచ్చి ఓ పెద్ద రాయి తీసుకుని కుక్కల మీదకు విసిరాడు. అవి అయితే తప్పుకున్నాయి కాని- అది దొర్లుకుంటూ పోయి ఎదురుగా వస్తున్న మామ్మగారికి తగిలింది...

"చచ్చాన్రోయ్ దేవుడా!" అంటూ ఆమె కాలు పట్టుకుని కూర్చుండిపోయింది.

"ఓరి నీజిమ్మడ- నీ పాడె కట్టా- నిన్ను కాల్చా! నీకేం ద్రోహం చేశానురా- నన్ను రాయితో కొడతావా! నువ్వు నరకానికి పోతావురా..." అంటూ బుడి బుడి దీర్ఘాలు తీయసాగింది.

"సారీ మామ్మగారు- మిమ్మల్ని కావాలని కొట్టలేదు- ఆ కుక్కల మీద విసిరితే పొరపాట్న మీకు తగిలింది..." ఆమె దగ్గరకు పోయి సారీ చెప్పాడు.

ఈలోగా ఆమె చుట్టూ జనం మూగారు.

"అరె నెత్తురు కారుతున్నది..."

"ఇంత పెద్దావిడ్ని కొడతావా?"

"కొవ్వెక్కిందా?"

"పాపం! చూడు- పెద్దావిడ ఎలా విలవిలలాడుతుందో- నీకు అమ్మా బామ్మలు లేరా? ఎలా పుట్టావురా?

ఎవరికి పుట్టావురా?"

సుబ్బారావు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు ఏం చేయాలో తోచక.

ఈలోగా జానీ తేరుకుని అందరి మీద విరుచుకుపడింది భౌ భౌ అంటూ- దాంతో అందరూ దూరంగా పారిపోయారు.

ఓ కుర్రాడైతే గురి చూసి గులకరాయి జానీ మీదకు విసిరాడు. అది దానికి తగిలింది. సుబ్బారావు పట్టుకున్న గొలుసును ఊడలాక్కుని ఆ కుర్రాడి మీదకు దూకింది- వాడు పరుగు అందుకున్నాడు...

ముందు ఆ కుర్రాడు-

ఆ తరువాత జానీ-

పరుగో పరుగు-

వీళ్ళెంబడి వీధి కుక్కలు...

"జానీ ఆగు- జానీ ఆగు!" సుబ్బారావు కేకలు పెట్టాడు.

జానీ వినే మూడ్‌లో లేదు...

ఆ కుర్రాడు పరుగులో ఛాంపియన్ లాగున్నాడు...

ఎటొచ్చి సుబ్బారావు పరుగు ఎప్పుడో మర్చిపోయాడు కాబట్టి బాగా అలసి పోయి- పరుగు ఆపేసి నడవసాగాడు- వాళ్లు వీధి మలుపు తిరిగి కనుమరుగైపోయారు.

సుబ్బారావు కాళ్ళీడ్చుకుంటూ వచ్చేసరికి జానీ అతివీర భయంకరంగా ఊర కుక్కలతో పోరాడుతున్నది.

గాయాల పాలైంది కూడా...


సుబ్బారావు కూడ యుద్ధంలో పాల్గొనాల్సి వచ్చింది.

దొరికిన రాళ్ళు కుక్కల మీదకు విసిరి తరిమేశాడు.

ఈసారి జానీ అతని చేతికి చిక్కింది...

ఇంక లాభం లేదనుకుని అటుగా పోతున్న ఆటోను ఆపి- భీమశంకరం అడ్రసు చెప్పి అటుగా పోనిమ్మన్నాడు. జానీ లోపలికి వచ్చి కూర్చుంది. ఆటో కదలి పోతూండడంతో ఓ బుర్ర మీసాల పెద్దాయన ఆటోకు ఎదురుగా నిలబడ్డాడు.

"ఆగు! ఏంటలా పారిపోతున్నావు- ఇది మా అబ్బాయిని కర్చింది...దీన్ని బ్రతకనివ్వం- మున్సి



పాలిటీ బండికి

అప్పుచెబుతాం-''

''అయ్యో! అంత పని చెయ్యకండి- ఏదో తెలీక తప్పు చేసింది... ఇది మంచి జాతి కుక్క-'' బ్రతిమాలాడు.

''అట్లాగయితే వాడి మందుల ఖర్చు ఎవరిస్తారు- ముందు డబ్బు అక్కడ పెట్టి కదులు-''

జేబులోంచి ఓ యాభై తీసి యిచ్చాడు- అది అందుకుని మళ్ళీ అతని మొహాన్నే విసిరి కొట్టాడు.

''ఏం బిచ్చం వేస్తున్నావా? బొడ్డు చుట్టూతా పధ్నాలుగు ఇంజెక్షన్లు వేయించుకోవాలి ఎవరిస్తారు- డాక్టరు ఫీజులు

ఎవరిస్తారు- మందుల ఖర్చు ఎవరిస్తారు?''

''ఎంత కావాలి?''

''రెండు వేలు!''

సుబ్బారావుకు గుండె ఆగినంత పనైంది.

''నా దగ్గర అంత లేదు- మా ఆఫీసుకురా కొంత యిస్తా!'' అంటూ బేరం మొదలెట్టాడు.

చివరకు వెయ్యికి బేరం సెటిలై- ఆటోని పోనిచ్చారు జనం.

ఆటో భీమశంకరం యింటి ముందు ఆగగానే రివ్వున జానీ లోపలికి దూసుకుపోయింది.

ఆటో చార్జి చెల్లించి లోపలికి అడుగు పెట్టాడో లేదో సుడిగాలిలా ఆండాళ్ళు మీదకొచ్చింది...

''ఏమయ్యా సుబ్రావు- నీకు అప్పు చెబితే నువ్వు చేసింది ఏమిటి? మా జానీ ఒంటినిండా గాయాలే! అది పుట్టి పెరిగినప్పటి నుండి ఒక్క దెబ్బగాని, గాయం గాని లేకుండా పెంచాం- ఒక్క రోజు నీకు అప్పుచెబితే దాని ప్రాణానికే ముప్పు తెచ్చావు- ఛీ ఛీ! ఏం ఉద్యోగాలు చేస్తారయ్యా ఆఫీసులో.''

సుబ్బారువుకు నోట మాట రాలేదు.

ఈలోగా భీమశంకరం బయటకు వచ్చాడు షర్టు గుండీలు పెట్టుకుంటూ.

''సుబ్రావు! ముందే చెప్పి ఉండాల్సింది తీసుకుపోనని, వాణ్ణి ప్రాణంగా పెంచుకున్నాం- అటువంటిది వాడికి ఇన్ని దెబ్బలు- గాయాలా! నీకు బుద్ధి ఉందా? దాని ప్రాణం పోయి ఉంటే నిన్ను డిస్మిస్ చేసే వాడిని.'' అంటూ శాపనార్థాలు పెట్టసాగాడు.

ఇద్దరూ కోరస్‌గా సుబ్రావును వాయించేశారు- సుబ్రావు జరిగింది చెప్పడానికి ప్రయత్నించినా వినకుండా.

''సరే. జరిగిందేదో జరిగింది- ముందు వాడ్ని డాక్టరు దగ్గరికి తీసుకుపోయి కట్టు కట్టించి- మందులు యిప్పించుకు రావాలి- తీసుకు పో- అమ్మో నువ్వు లాభం లేదు- నీ వెంబడి మా ఆండాళ్ళు వస్తుంది... ఆటో ఛార్జీలు- డాక్టరు ఫీజులు అన్ని నువ్వే భరించు - తేడా వచ్చిందో తోలు తీస్తా!'' భీమశంకరం తన నిర్ణయం తెలియ చేశాడు.

''మీ కుక్క కరిచిన వాళ్ళు వెయ్యి రూపాయలు అడుగుతున్నారు- ఆఫీసుకు వస్తారట- మీరు ఆ వెయ్యి యిప్పిస్తే-'' నసిగాడు.

భీమశంకరం మూడో కన్ను తెరిచాడు...

''నాకేం సంబంధం- వెధవ పని చేసింది నువ్వు! కట్టుకోవాల్సింది నువ్వే!''


''నీకు సిగ్గు లేదటయ్యా- మీ బాసును డబ్బులు అడగటానికి!'' ఆండాళ్ళు అరికాలు మీద లేచింది.

సుబ్బారావుకు బరువు బాధ్యత లెక్కువ. బడుగు జీవి- జీతం సరిపోదు- అందుకని వాళ్ళ కాళ్ళా వేళ్ళా పడ్డాడు- కానీ రాతినన్నా కరిగించచ్చేమో కాని- భీమశంకరంను మటుకు కదిలించలేకపోయాడు.

''ఆటో పిలు- డాక్టరు దగ్గరికి పోదాం-''

''వెటర్నరీ డిస్పెన్సరీ ఎక్కడుందో నాకు తెలీదు సార్!''

''నీ మొహం- జానీకి ఇంగ్లీషు వైద్యం పడదు- హోమియో వాడతాం- పక్కవీధిలో డాక్టరు నిర్మల ఉంది...'' అంటూ ఆటోను పిల్చి ముగ్గురు కల్సి అక్కడికి బయలుదేరారు.




లక్కీగా ఆమె యింట్లోనే ఉంది. పరిశీలించి 'గాయాలు బాగా అయ్యాయి- ర్యాబిస్ రాకుండా జాగ్రత్తపడాలి' అంటూ ఎన్నో మందులు, ట్యూబులు రాసిచ్చింది. ఓ నాలుగొందలయ్యాయి.

ఆయింట్‌మెంటు రాసి రోజూ డ్రస్సింగ్ చేయాలని చెప్పింది.

ఈ తతంగం అయ్యేసరికి ఇంకో గంట పట్టింది.

భీమశంకరంను- ఆండాళ్ళును వారి జానీని ఇంటి దగ్గర దింపి- బ్రతుకు జీవుడా అంటూ బయట పడిపోయాడు.

''సార్! నమస్కారం సార్- మా వాడి సంగతి కాస్త గుర్తుంచుకోండి సార్!''

''ఆ ఎందుకు గుర్తుండదు- నీ సంగతి- మీ వాడి సంగతి జీవితాంతం- గుర్తుంటుంది...ఛీ!ఛీ! ఈ కొత్త ఊరు నాకు నచ్చలేదు- పని మనుషులు దొరకరు దొరికిన వాళ్ళకి తెలివి ఉండదు-'' కసురుకున్నాడు-

''కర్నూలు నిండా గాడిదలే!'' ఆండాళ్ళు వ్యాఖ్యానించింది. సుబ్బారావు తలొంచు కున్నాడు.